వార్షిక రుణ లక్ష్యాలు పూర్తి చేయాలి

• కలెక్టర్ కుమార్ దీపక్


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వార్షిక రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం డెబోజీత్ బౌరా, నాబార్డ్ డీడీఎం, అబ్దుల్ రవూఫ్, తెలంగాణ గ్రామీణా బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.మురళీమోహన్‌రావు, బ్యాంకు అధికారులతో రుణ లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 2024–25వరకు రుణం కింద రూ.1295కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.1980 కోట్లు అందించినట్లు తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.460కోట్లు, గృహ నిర్మాణ రుణాల లక్ష్యం రూ.280కోట్లు, విద్యారుణాలు రూ.20కోట్లు ప్రాధాన్యత రంగాల కింద రూ.2,522కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ముద్ర రుణాల కింద 18,374 మందికి రూ.156కోట్లు అందించామని, 5,672స్వయం సహాయక సంఘాలకు గాను రూ.575కోట్లు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలు రూ.320కోట్లు సాధించినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 75ప్రాజెక్టుల లక్ష్యానికి గాను 43ప్రాజెక్టులకు రాయితీ రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రధానమంత్రి జన్‌ధన్ పథకం కింద 3 లక్షల 34వేల 52మంది ఖాతాలు తెరిచినట్లు తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద 1,18,379మందికి, ప్రధానమంత్రి సురక్షా బీమా 2,97,781మందికి, అటల్ పెన్షన్ యోజన కింద 42,702మందికి లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాకు చెందిన 181మందికి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ అందించినట్లు తెలిపారు. వ్యవసాయ సాగుకు సంబంధించి రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించి అవసరమైన నూతన రుణాలు పొందేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రుణా ప్రణాళిక లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీజీబీ ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన 9 ఏళ్ల చిన్నారి గడెవార్ జాగృతి బ్లడ్ కేన్సర్ బారిన పడి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారని 'సాక్షి'లో 'ఈ పాపను కాపాడరూ' అని వచ్చిన కథనానికి మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యులు స్పందించి మంగళవారం రూ.12వేల ఆర్థిక సాయంను పాప తండ్రి గజానన్‌కు అందించారు. కార్యక్రమంలో మమత గౌరవ అధ్యక్షురాలు గోనె ఇందిరాదేవి, అధ్యక్షురాలు సముద్రాల రమ, కార్యదర్శి మాధవరపు శృతి, అడ్వైజర్ గోనె భ్యాలక్ష్మీ, జాయింట్ సెక్రటరీ రావుల భాగ్యలక్ష్మి, సలహాదారులు జ్యోత్స్న చంద్రదత్, సభ్యులు శ్రీదేవి గౌడ్, మంజుల, సత్యవతి, వనజ, జ్యోతి పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడి జప్తు చేసిన వాహనాలకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 27ద్విచక్ర వాహనాలు జప్తు చేసినట్లు తెలిపారు. వీటికి బెల్లంపల్లి ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో నిర్ధేశించిన తేదీన ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొన దలిచిన వ్యక్తులు వాహన విలువలో 50 శాతం ఈఎండీ ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాహనాల పరిశీలన, ఇతర సమాచారం కోసం బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సీఐ కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట/మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని ప్రముఖ న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ లక్సెట్టిపేట, జిల్లా కేంద్రం న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బంవరం జగన్, ఎలక్షన్ కమిషన్ అనిల్ రాజు, పులి రాజమల్లు, స్వామి, మురళి, డేగ రవి, రంగు మల్లేష్, తులా ఆంజనేయులు, కిరణ్, గోపతి రవి, లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'డబ్బులు డిమాండ్ చేయడం అవాస్తవం'

మంచిర్యాలక్రైం: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఎక్సైజ్ శాఖ అధికారిని పిలిచి డబ్బులు డిమాండ్ చేశారని ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి నందగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనాడు మద్యం దుకాణాలు, వ్యాపార స్థుల వద్ద జిల్లా అటవీ శాఖ అధికారి డబ్బులు వసూలు చేయలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

మందమర్రి తైబజార్ వేలం

మందమర్రిరూరల్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపాలిటీలోని తైబజార్‌ను మంగళవారం ఆర్వో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేలం వేశారు. వేలంలో ఏడుగురు పాల్గొనగా కనుకుంట్ల సుదర్శన్ రూ.4,73,200 తైబజార్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం రూ.4.29లక్షలకు దక్కించుకున్నాడు.

స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంగా అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఏ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు ప్రణాళిక ఆమోదించినట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్లో https:// tgobmmsnew. cgg. gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని, అర్హత ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరాలను https:// tgobmms. cgg. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

భీమిని: కన్నెపల్లి మండలంలోని ముత్తపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం పేకాటశిబిరంపై పోలీసులు దాడి చేశారు. రూ.1500, రెండు ఆటోలు, రెండు బైకులను స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎనిమిది మంది వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఎస్సై గంగారాం పేర్కొన్నారు.

నిషేధిత విత్తనాలు వినియోగిస్తే చర్యలు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన, బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్ అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల రైతువేదికలో మంగళవారం వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల వల్ల కలిగే అనార్థాలపై రైతులకు అవగాహన కల్పించారు. దళారులను నమ్మి నిషేధిత గ్లేసిల్ పత్తి విత్తనాలు సాగు చేసి మోస పోవద్దని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి, విధిగా రశీదులు పొందాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాల వివరాలు తెలిస్తే పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, బెల్లంపల్లి, తాండూర్ మండల వ్యవసాయాధికారులు ఎస్.ప్రేమ్ కుమార్, సుష్మ, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, ఏఈవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నకిలీవిత్తనాలు అమ్మితే చర్యలు

భీమారం: మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ షాపుల్లో మంగళవారం వ్యవసాయ, పోలీసుశాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఏవో అత్తె సుధాకర్, ఎస్సై శ్వేత రికార్డులు, స్టాక్ పరిశీలించారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అసత్య ఆరోపణలపై క్షమాపణ చెప్పాలి'


మాట్లాడుతున్న సురిమిల్ల వేణు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అసత్య ఆరోపణలు చేయడంపై మంచిర్యాల కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించి, వెంటనే మాజీ ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణులు మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యే ఎక్కడ అక్రమాలు చేశారో, ఎవరిని బెదిరించారో దివాకర్‌రావు నిరూపించాలని, లేనిపక్షంలో ప్రజల సమక్షంలో క్షమాపణలు చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించినట్లుగా తమకు అన్పిస్తుందని, ఆయన తనయుడు విజిత్‌రావు తన తండ్రికి మంచి వైద్యం అందించాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ మాట్లాడుతూ.. మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మీ టాకీస్ చౌరస్తా వరకు అనాలోచితంగా నిర్మించిన సర్కిళ్ల ద్వారా 11మంది ప్రాణాలు తీసిందని, అందుకు మాజీ ఎమ్మెల్యే కారణం కాదా అని అన్నారు. సర్కిళ్లను కుదించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తున్న ఎమ్మెల్యేపై కడుపుమంటి తప్పుడు విమర్శలను చేయడం అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఉమర్‌మియా కాలనీ భూయజమానుల సమస్యలను సుదీర్ఘ కాలం పరిష్కరించకుండా, ఎమ్మెల్యేపై నిందలు వేయడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే తైబజార్‌లో అక్రమాలు జరిగితే మొత్తానికి రద్దు చేసి, చిరు వ్యాపారస్తులకు ఆర్థిక వెసులుబాటును కల్పించి, సొంత డబ్బులను మున్సిపాలిటీకి కట్టింది తమ ఎమ్మెల్యే కాదా అని అన్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై అవగాహన


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ

చెన్నూర్‌రూరల్/భీమిని: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై అవగాహన కల్పించారు. భీమిని, కన్నెపెల్లి మండలాల్లో మంగళవారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. 'ఒకే దేశం –ఒకే ఎన్నిక'తో దేశాభివృద్ధి సాధ్యం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ అన్నారు.

ఈజీఎస్ పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో మెటల్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనులను ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్ కోరారు. ఈజీఎస్ పనులపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు వేగంగా పూర్తి చేసి, జిల్లాలోనే అగ్రగామిగా నిలువాలని కోరారు. సమీక్షలో ఈసీ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం జీనత్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ద్వితీయ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

నస్పూర్: నగర పరిధిలోని నస్పూర్‌కాలనీ శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గామాత దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిరిపురం రామన్న, కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిప్ప రాజబాబు, కమిటీ సభ్యులు దేవసాని నాగరాజు, తౌటం మల్లేశ్, కుంట రామన్న,రాజన్న, వెంకన్న, రాములు, రమేశ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు

బెల్లంపల్లి: బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించిన ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. టకారియా నగర్‌లో బహిరంగంగా మద్యం తాగుతున్న పెట్టం అశోక్, బదావత్ రమేష్‌నాయక్, కోవకుల సాయికుమార్, లవుడియా సాయికుమార్, బెడ్డల అఖిల్, దార కౌశిక్, జన్నారపు అఖిలేష్ అనే యువకులను మంగళవారం పట్టుకున్నట్లు తెలిపారు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఇకపై నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

రామకృష్ణాపూర్: బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో అమ్మాయిలపై జరుగుతున్న నేరాలు, ఆన్‌లైన్ యాప్స్ మోసాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోటపల్లి: మండలంలోని జనగామలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు మంజూరు కా గా మంగళవారం మాజీ ఎంపీటీసీ తిరుపతి ప్రారంభించారు.

మార్కెట్‌లో మజ్జిగ పంపిణీ

జన్నారం: మండలంలోని మార్కెట్ ఏరియాలో పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో ఈ నెల 27న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సు పోస్టర్‌ను వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు.

వైద్యుడికి సన్మానం

దండేపల్లి: రోగులకు ఉత్తమ సేవలందించి పీహెచ్‌సీని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపినందుకు తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు క్రాంతి కుమార్‌ను మాల మహానాడు దండేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు.

రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వేసవి పశుగ్రాస పంటలు, పండ్ల తోటల యాజమాన్య పద్ధతులు, నానో యూరియా ఉపయోగాల గురించి శాస్త్రవేత్తల ద్వారా వివరించారు. అనంతరం ఏడీఏ బానోతు ప్రసాద్ రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఉచిత కంటి శిబిరం

భీమిని: శ్రీరామ సేవ సమితి, భీమిని మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. 46మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు.

సమస్య పరిష్కరిస్తాం

భీమిని: మండలంలోని పెద్దగుడిపేటలో సోమిటెంకి పోచయ్య, మురికి గుట్టయ్య వద్ద భూమి కొనుగోలు చేయగా, తను రిజిస్ట్రేషన్ చేయలేదు. ఈ విషయమై పోచయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ బికర్ణదాస్, ఎస్సై విజయ్‌కుమార్, ఆర్‌ఐ వెంకటేశ్ పోచయ్య ఇంటికెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డుకు మరమ్మతులు

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతు చేపట్టడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఆదేశాలతో ఓరియంట్ ఆధ్వర్యంలో మంగళవారం సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు.

రూ.50వేలు విరాళం

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో బంజారాలు నిర్మించిన శ్రీ జంగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రతిష్ఠాపన కోసం పోలంపల్లి మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్ మంగళవారం రూ.50,116నగదు విరాళంగా అందజేశారు.

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన

కోటపల్లి: మహిళ చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా చైల్డ్ ఉమెన్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ విజయ అన్నారు. కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

బండి సంజయ్‌పై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

రామకృష్ణాపూర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

'జిజ్ఞాస'పై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మంచిర్యాల జిల్లా సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిజ్ఞాస కార్యక్రమాలు నిర్వహించారు. సైన్స్ సెంటర్ బోధకులు సంపత్, లక్ష్మణ్‌లు జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా వివిధ బోధనోపకరణాల ద్వారా మానవ శరీరం, సైన్స్‌పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కార్తీక్

చెన్నూర్: చెన్నూర్‌లోని న్యాయవాదుల ఛాంబర్‌లో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మద్ది కార్తీక్‌ను, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్/లక్సెట్టిపేట/కోటపల్లి/వేమనపల్లి: రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 50 శాతం రాయితీతో అందించే వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తాండూర్, లక్సెట్టిపేట, కోటపల్లి,వేమనపల్లి వ్యవసాయాధికారులు సుష్మా, శ్రీకాంత్, సాయికృష్ణ, వీరన్న తెలిపారు.

'స్వచ్ఛందంగా ఆర్థిక సాయం చేస్తాం'

మంచిర్యాలటౌన్: పట్టణంలో మహాప్రస్థానం నిర్వహణ కోసం స్వచ్ఛందంగా తాము ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చామని కులసంఘాల నేతలు జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బెదిరించడంతోనే చందాలు ఇస్తున్నట్లు అన్నారని, కాని అది వాస్తవం కాదన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకుడు రాము, మార్వాడి సమాజ్ నాయకుడు పవన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్ పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి కార్యదర్శి షేక్ బాజీసైదా ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో గత సంవత్సరం సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను భర్తీ చేసినా, అందులో కొంతమంది కార్మికులు బేసిక్ తగ్గిందని పాత క్యాటగిరిలోకి తిరిగి వెళ్లారన్నారు. దీంతో ఏర్పడిన ఖాళీలను ఇప్పటికీ భర్తీ చేయలేదన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో డిప్యూటేషన్‌పై 30మంది కార్మికులను తీసుకుంటామని యాజమాన్యం ప్రకటించిందని, ఈ డిప్యుటేషన్‌ను రద్దుచేసి సీనియార్టీ ప్రకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, గొల్లపల్లి రామచందర్, ఫిట్ సెక్రెటరీ గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు సురేష్, సత్తిరెడ్డి జీపీ రావు, భోగ మధునయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు


కార్మికులతో మాట్లాడుతున్న బాజీ సైదా

సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పాగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాల వారీగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే సేఫ్టీ ట్రిపార్టీయేట్ సమావేశం నిర్వహించాల్సి ఉండగా, 15నెలల నుంచి నిర్వహించడం లేదన్నారు. దీంతో గనుల్లో రక్షణ చర్యలు లోపించి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల పరిధిలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. గనుల్లో మెటీరియల్ కొరత ఉందని, నాసిరకం రక్షణ పరికరాలతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వేసవి దృష్ట్యా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓసీపీల్లో కార్మికులకు ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిపై యాజమాన్యం వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గైర్హాజర్ అయితే ఉద్యోగాలు ఊస్ట్!

• గైర్హాజరు కార్మికులకు హెచ్చరిక


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: విధులకు గైర్హాజర్ అయితే ఉద్యోగాలు పోతాయని సింగరేణి అధికారులు కార్మికులకను హెచ్చరించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గైరాజరు కార్మికులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 2024లో 100 మస్టర్లు చేయని కార్మికులను వారి కుటుంబ సభ్యులతోసహా పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. సందర్భంగా ఇన్‌చార్జి జీఎం కె.రాజేందర్, ఇతర అధికారులు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. చిన్న చిన్న కారణాలతో డ్యూటీలకు ఎగనామం పెట్టొద్దని సూచించారు. ఏటా 100 మస్టర్ల కంటే తక్కువ చేస్తే కంపెనీ నిబంధనల ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా గైర్హాజరు కార్మికుల దృష్టిలో మార్పు వచ్చి సక్రమంగా డ్యూటీలకు రావాలన్నారు. ఐకే–1ఏ, ఐకే గైర్హాజరు లిస్టులో ఉన్న వారిని ఈ కౌన్సెలింగ్ పిలవగా వీరిలో 27 మంది కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్‌బాజీసైదా, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, డీవైపీఎం రాజేశ్, సంక్షేమ అధికారులు అజ్మీర రమేశ్, రామాచారి, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

• ఏసీపీ వెంకటేశ్వర్


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్సై శ్రీధర్

జైపూర్: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అని, సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు తోడ్పడుతాయని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఇందారం–టేకుమట్ల ఎక్స్‌క్రాస్ రోడ్డు వద్ద సోలార్‌తో పనిచేసే ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్సై శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. స్థానిక నాయకుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద అసాంఘి కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్: పట్టణంలోని శార్వాణి నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు మేడ సనాతని, జోడు హిమన్షులు నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి సీట్లు సాధించినట్లు శార్వాణీ పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నవోదయకు ఎంపికైన ఇరువురు విద్యార్థులను స్థానిక సీఐ దేవేందర్‌రావు అభినందించారు.

జన్నారం: మండలకేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హాన్స్ పాఠశాలకు చెందిన శివప్రసాద్ అనే విద్యార్థి నవోదయ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పాఠశాల నుంచి విద్యార్థి ఎంపికవడం హర్షనీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, తదితరులున్నారు.

వైభవంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్

జైపూర్: మండలంలోని నర్వ గ్రామంలో మంగళవారం శ్రీ హనుమాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రధాన వ్యవస్థాపకులు, నర్వ మాజీ సర్పంచ్ దూట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మాజీ మున్సిల్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, బింది ప్రవీణ్, మంత్రి రామయ్య, కాసెట్టి నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

చెన్నూర్: చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవికిషన్ నేతృత్వంలో మంగళవారం లెక్కించినట్లు దేవాధర్మాదాయ శాఖ ఈవో ఎం.రవి తెలిపారు. హుండీ ఆదాయం రూ.2.75లక్షల నగదు, మిశ్రమ బంగారం 2.4 గ్రాములు, మిశ్రమ వెండి 141గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల రాస్తారోకో

బెల్లంపల్లి: సమస్యల పరిష్కారం కోసం 'ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బెల్లంపల్లి కాంటాచౌరస్తా వద్ద స్థానిక ఆశావర్కర్లు రాస్తారోకో నిర్వహించారు.